క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గుణుపూరుపేట విద్యార్థిని



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని రేష్మతో హెచ్‌ఎం కృష్ణకుమారి, పీడీ గౌరీశంకర్

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కెల్ల రేష్మ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల పెదమేడపల్లిలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రేష్మ 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం, 800 మీటర్ల రన్నింగ్ విభాగంలో తృతీయ స్థానం సాధించింది. వచ్చేనెల 2 నుంచి 4 వరకు శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు సారిపల్లి గౌరీశంకర్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని హెచ్‌ఎం కృష్ణకుమారి, తదితరులు బుధవారం అభినందించారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి



సీతారామునిపేటలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని రైతులు తగ్గించాలని ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని రామతీర్థం, సీతారామునిపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరి పంటకు సోకే తెగుళ్ల నివారణపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలికి సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి చంద్రశేఖర్, సర్పంచ్ రాంబార్కి రామారావు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి..

- సీఐ చంద్రమౌళి



మాట్లాడుతున్న పాలకొండ సీఐ చంద్రమౌళి, తదితరులు

పూసపాటిరేగ: అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని పాలకొండ సీఐ కె. చంద్రమౌళి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరవీరులు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకుని నక్సలైట్ల మందుపాతరకు బలైన కానిస్టేబుల్ సరగడ సూర్యనారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, విద్యార్థులు పోలీసుశాఖలోకి రావాలని పిలుపునిచ్చారు. అలాగే సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం బి. శంకరరావు, ఎస్సై మస్తాన్ ఉన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

- కమిషనర్ నల్లనయ్య



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. నగరంలోని 40, 42 డివిజన్‌లలో బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆక్రమణలను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. 42వ డివిజన్ అయ్యన్నపేట కామాక్షినగర్ ప్రాంతంలో పాఠశాల, పార్కుకోసం కేటాయించిన స్థలంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన పూరిపాకలను తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా 40వ డివిజన్ ఆర్‌సీఎం చర్చి రోడ్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఐవీ రమణమూర్తి ఆధ్వర్యంలో టీపీఓ అప్పలరాజు, ఇతర సిబ్బంది తొలగింపుచర్యలు చేపట్టారు.

సత్కారం

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పి.రామచంద్రరావును సంఘ జిల్లా కమిటీ సభ్యులు బుధవారం సత్కరించారు. స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు ఆయన సేవలను కొనియాడారు. సంఘ అధ్యక్షుడు శ్రీరామచంద్ర పండా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఎంపీ తిరుపతిరావు, కోశాధికారి సొంటి కామేశ్వరరావు, ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌వీ యుగంధర్, జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బి.బాలభాస్కరరావు, కోశాధికారి శంకరరావు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు.. అందని మందులు

- జగనన్న పాలనలో ఇంటి వద్దే ఉచితంగా అందజేత
- గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు నిలిపివేస్తున్న కూటమి ప్రభుత్వం



మందులు

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాన్ని, ప్రతి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేస్తోంది. ప్రజలకు ఎంతో మేలు చేసే పథకం అయినప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిందనే కారణంతో ఆపేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్పెషలిస్టు వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించి, ఈసీజీ, వైద్య పరీక్షలు కూడా అక్కడే నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిలిపివేశారు. అవ్వాతాతలకు గ్రామాలకు వెళ్లి నిర్వహించే వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా ఆపేశారు. తాజాగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికే మందులు అందించే కార్యక్రమాన్ని కూడా నిలిపేశారు. కిడ్నీ, బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఆస్పత్రికి వెళ్లలేరు. ఇటువంటి వారికి ఇంటికే మందులు అందించడం వల్ల వారికి ఎంతగానో ఉపయోగపడేది. కాని ఇప్పుడు మందులు అందని పరిస్థితి నెలకొంది. దీంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోగులకు ఇంటికే మందులు అందించే కార్యక్రమాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. 2024 ఆగస్టు వరకు ఈ కార్యక్రమం ఓ ఉద్యమంలా కొనసాగింది. ఆగస్టు నెలఖారు నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. కార్యక్రమం ప్రారంభం నుంచి ఆగస్టు నెలఖారు నాటికి జిల్లాలో 13,210 మంది దీర్ఘకాలిక రోగులకు మందులు అందజేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'లో వైద్యుడి సిఫార్సుపై మందులు అందజేత

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి వచ్చే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యులు పరీక్షించి ఆరోగ్య సురక్ష యాప్‌లో ఏపీఎంఐడీసీ ఫార్మసీ విభాగానికి పంపించేవారు. వైద్యుడు సూచించిన మందులను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని వ్యాధిగ్రస్తుడి ఇంటికి ప్యాక్ చేసి మరీ పోస్టు ద్వారా ఇంటికే పంపించేవారు. రోగులకు ఖరీదైన మందులను సైతం ఉచితంగా ఇంటి వద్దకే అందజేసేవారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలా మంది ఆస్పత్రికి వెళ్లలేరు. కొంతమంది మంచానికే పరిమితం అయిన వారు ఉంటారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న రోగులు ఆస్పత్రికి వెళ్లలేరు. అటువంటి వారికి ఇంటి వద్దకే మందులు పంపించడం వల్ల వారికి ఉపయోగకరంగా ఉండేది. అంతేకాకుండా మందులకు ఖర్చు కూడా ఆదా అయ్యేది.

ఆదేశాల మేరకే...

ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు నుంచి దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే మందులు అందజేసే కార్యక్రమం నిలిపివేయాలని ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు వీటి సరఫరాను నిలిపివేసాం.
– పి.ఎస్.కల్యాణ్, ఫార్మసీ ఆఫీసర్, ఏపీఎంఐడీసీ

సురక్షిత నీరు అందించండి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



భోగాపురం: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

భోగాపురం: మండలంలోని ప్రజలకు వాటర్ ట్యాంకుల ద్వారా సురక్షిత నీరు అందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండలంలోని చాకివలసలో బుధవారం ఆయన పర్యటించి వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరు అందక డయేరియా వ్యాధి బారిన పడుతున్నారన్నారు. 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మత్స్యశాఖ, ఇతర అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రతీర ప్రాంతాలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చోడిపిల్లిపేట, చేపలకంచేరు గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కీర్తి, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీఎల్‌పీఓ మోహనరావు, తహసీల్దార్ ఎం. సురేష్, ఎంపీడీఓ కిషోర్‌కుమార్, ఈఓపీఆర్‌డీ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: : పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

క్లోరినేషన్ చేయాలి

డెంకాడ: గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేసి, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని నాతవలసలో ఆయన పర్యటించారు. మురుగు కాలువలు, వాటర్ పైప్‌లైన్, ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్షిత మంచినీటి ట్యాంకులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలను ఆదేశించారు. డ్రైనేజీలో తాగునీటి పైపులైన్ ఉండడాన్ని గమనించిన కలెక్టర్ దాన్ని తొలగించాలని సూచించారు. పని చేయని బోరుబావులను సీజ్ చేయాలని ఆదేశించారు. మురుగునీరు ప్రవహించే ప్రతిచోటా బ్లీచింగ్ చల్లాలన్నారు. ఇళ్ల మధ్యలో డ్రైనేజీ లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా... ఉపాధి నిధులతో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ భవానీని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కీర్తి, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, తహసీల్దార్ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



మహిళల కోలాటం

విజయనగరం టౌన్: సిరులతల్లి పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా చదురుగుడి ఆవరణలో బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కొండగండ్రేడు గ్రామానికి చెందిన బోడసింగు కృష్ణ బృందం కోలాట ప్రదర్శన అలరించింది. అలాగే విశాఖకు చెందిన కె.హేమాద్రి బృందం నృత్య ప్రదర్శన, తెన్నేటి శ్రీనివాసరావు భక్తి గీతాలాపన ఆకట్టుకున్నాయి. అదేవిధంగా రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో పెంట సన్యాసినాయుడు, పచ్చిపులుసు ధర్మారావు, మొకర సత్యనారాయణ, జి.స్వామినాయుడుల ఏకపాత్రాభినయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు సత్కరించారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం వేణుగోపాలరావు, కార్యదర్శి తవుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకోవాలని హెచ్‌ఎం వేణుగోపాలరావు, కార్యదర్శి తవుడు సూచించారు. మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో డయేరియాపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రస్తుతం గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరన్నారు. వీలైనంత వరకు వేడి పదార్థాలు తినాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందులు వాడాలి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌరి

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా హెచ్‌ఐవీ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ గౌరి తెలిపారు. పట్టణంలోని గుచ్చిమి వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, హెచ్‌ఐవీ రోగులు ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడడం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చునని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం వేణుగోపాలరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ఆరోగ్యంపై అయోడిన్ ప్రభావం' అంశంపై పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఈ పోటీల్లో లెంక జాహ్నవి, పతివాడ యోగిత, పతివాడ శ్యామ్‌కుమార్ విజేతలుగా నిలిచారు. విజేతలను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

నట్టల నివారణ మందులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు దామోదరరావు



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు దామోదరరావు

భోగాపురం: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు దామోదరరావు కోరారు. మండలంలోని కారిగొల్లపేట గ్రామంలో 500 గొర్రెలు, 150 మేకలకు బుధవారం నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ... నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుందన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న 4, 31, 384 జీవాలకు గాను ఇంతవరకు 60 శాతం జీవాలకు మందులు వేశామని తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా ప్రారంభం కానున్న 21వ అఖిల భారత పశుగణన నాలుగు నెలలు పాటు కొనసాగుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పశువైద్యశాలను తనిఖీ చేశారు. మందులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏరియా సహాయ సంచాలకుడు ఉమాశంకర్ మహాపాత్రో, పశువైద్యాధికారి కమలకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం ధ్యానం చేయాలి

- స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపాలకృష్ణ



ధ్యాన సందేశం అందిస్తున్న గోపాలకృష్ణ

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ ధ్యాన సాధనను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోపాలకృష్ణ (యునైటెడ్ కింగ్‌డమ్) సూచించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని బృందావన్ వ్యాలీలో నిర్మించిన పత్రీజీ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధ్యాన అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. పత్రీజీ ప్రారంభించిన ధ్యాన మహాయజ్ఞం ప్రపంచ వ్యాప్తంగా కొనసాగడం ఆనందించదగ్గ విషయమన్నారు. ధ్యానంతో పాటు మంచి సందేశాన్ని అందించే పుస్తకాలు చదవడం, సత్ సాంగత్యంలో పాల్గొనడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తొమ్మిది పిరమిడ్లతో ఉత్తరాంధ్రలోనే అతి పెద్దదైన ధ్యాన మందిరం నెల్లిమర్ల బృందావన్ వ్యాలీలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్లు ద్వారంపూడి వీరారెడ్డి, డీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రెసిడెంట్ జగ్గిన రామారావు, తగరపువలస ప్రాంత ఇన్‌చార్జ్ గౌతమ్, వైజాగ్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ రమణీష్, బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి సుబ్బారెడ్డి, నెల్లిమర్ల పిరమిడ్ ధ్యాన మందిరం ప్రతినిధి ద్వారంపూడి శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా తాగునీటి పరీక్షలు

- మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు



జోగిరాజుపేటలో నీటి నాణ్యత పరీక్షలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కూర్మినాయుడు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో తాగునీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు సూచించారు. మండలంలోని జోగిరాజుపేటలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు కలుషితమైతే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరీక్షల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పైప్‌లైన్లను నిత్యం పరిశీలిస్తూ లీకులను సరిచేయాలని, ట్యాంక్‌లను శుభ్రపరచాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణరాజు, ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథ్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి అంబలం పూజకు ఏర్పాట్లు పూర్తి

- పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు సూర్యపాత్రో

విజయనగరం టౌన్:

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పైడితల్లి అమ్మవారి అంబలం పూజను కోట వద్ద భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో బుధవారం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, గురుస్వాములు ఎస్.అచ్చిరెడ్డి, బొంగ మహేష్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న శుక్రవారం సాయంత్రం కోట వద్ద శ్రీపైడిమాంబ దీక్షాధారులతో భారీ ఎత్తున అంబలం పూజ నిర్వహిస్తామన్నారు. అష్టలక్ష్మిలతో కూడిన పైడిమాంబ అంబలం అరటి దవ్వలతో కట్టి తొమ్మిది కలశాలకు కుంకుమపూజలను, దీక్షాధారులతో పడి పూజ నిర్వహిస్తామన్నారు. పైడితల్లి దీక్షాపరులతో పాటు వివిధ రకాల మాలాధారణ చేసిన దీక్షాధారులందరూ హాజరవుతారని చెప్పారు. అమ్మవారి భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొని తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.నాగరాజు, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శ్రీనివాస్

పట్టణంలోని మిమ్స్ సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా పి. శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా, అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సీహెచ్ రమామోహిని సింహాచలం గురుకులానికి బదిలీపై వెళ్లారు. శ్రీనివాస్‌ను పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంబల్ల ప్రసాద్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు. - నెల్లిమర్ల

అవగాహన సదస్సు



ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీలో సీపీఆర్‌పై (గుండె ఆగిన వెంటనే చేయాల్సిన ప్రథమ చికిత్స) అవగాహన సదస్సు నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నారాయణరావు, చిన్నంనాయుడు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. - విజయనగరం ఫోర్ట్

ఆందోళన..



నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. 2016 నుంచి 2018 వరకు తమకు రావాల్సిన ఎరియర్స్‌లో అవకతవకలు జరిగాయని, దానిపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించినట్టు తమకు కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా తమ ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం కమిషనర్ కె. అప్పలరాజు, చైర్‌పర్సన్ బంగారు సరోజినికి అందజేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జగన్ మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు సురేష్, హరిబాబు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. - నెల్లిమర్ల

జాగ్రత్తలే ప్రధానం..



అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో స్థానిక అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మన్ ఎస్ఎన్ సంతోష్‌కుమార్ వివరించారు. స్థానిక మహారాజా అటానమస్ కళాశాలలో అగ్ని భద్రత - విపత్తు నిర్వహణ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వేసవిలో గ్యాస్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ఎం. సాంబశివరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి జి. చంద్రశేఖర్, శ్రీకాంత్, చిన్నంనాయుడు, ఎ.కల్యాణ్ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు. - విజయనగరం అర్బన్

కనులపండువగా మెట్ల పూజ



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు వెలిసిన వనంగుడి ఆవరణలో బుధవారం రాత్రి మెట్లపూజ నిర్వహించారు. వందలాది మంది పైడితల్లి దీక్షాపరుల జై పైడిమాంబ నినాదాలు, మంత్రోచ్ఛారణలతో ఆ ప్రాంతం మార్మోగింది.పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, గురుస్వాములు ఎస్. అచ్చిరెడ్డి, మహేష్, ఉమ్మెద భాస్కరరావు, శ్రీను, త్రినాథ్, తదితరులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. - విజయనగరం టౌన్